నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, బుధవారం 10 జూలై 2024 | BHADRADRI KOTHAGUDEM

# ఉద్యోగాల పేరిట భారీ మోసం

- భద్రాద్రి జిల్లాలో ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు
- 13 మంది మోసగాళ్ల గుర్తింపు.. పదిమంది నిందితుల అరెస్ట్
- 60 మంది బాధితుల్లో 32 మంది భద్రాద్రి జిల్లాకు చెందిన వారే..
- మొత్తం రూ.4.08 కోట్లు వసూలు చేసినట్లు విచారణలో స్పష్టం
- రూ.1.47 కోట్ల నగదు, ఆభరణాలు, బైకు, డాక్యుమెంట్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు


హారికను అరెస్ట్ చేసి.. రికవరీ చేసిన నగదు, నగలను మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం క్రైం, జూలై 9 : సింగరేణి సహా వివిధ ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ 60 మందిని మోసం చేసిన ఒక ముఠాలోని పది మందిని భద్రాద్రి జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1.47 కోట్ల నగదు, బంగారు ఆభరణాలు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకు, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. హైదరాబాద్‌లో నివాసముంటున్న దాసు హరికిషన్, అతడి భార్య హారికతోపాటు సింగరేణి విశ్రాంత ఉద్యోగి గుండా వినోద్‌కుమార్, ఉపేంద్రనాయుడు సహా మరికొందరు కలిసి 2018లో ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా అమాయకులను ఆసరాగా చేసుకుని ఉద్యోగాల పేరిట వారిని మోసం చేయడం మొదలుపెట్టారు. సింగరేణి కోల్‌బెల్ట్ ఏరియాలోని నిరుద్యోగులను టార్గెట్ చేశారు. సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్, క్లర్క్, డిపెండెంట్ ఉద్యోగాలు, గ్రూప్-2లో ఏసీటీవో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు కూడా చేయిస్తామంటూ మాటలు చెప్పారు. ఈ నేపథ్యంలో సుమారు 60 మంది అమాయక నిరుద్యోగుల నుంచి రూ.కోట్లు వసూలు చేశారు. తొలుత వారిని నమ్మి డబ్బు ఇచ్చిన బాధితులకు ఎంతకీ ఉద్యోగాలు రాలేదు. దీంతో వారు నిలదీశారు. దీంతో దాసు హరికిషన్, అతడి ముఠా సభ్యులు ఎదురు తిరిగారు. ఆ తరువాత చేతులెత్తేశారు. దీంతో బాధితులంతా పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు భద్రాద్రి జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో 32 మంది బాధితులు చేసిన ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుల వద్ద నుంచి ఈ ముఠా ఇప్పటి వరకు రూ.4.08 కోట్లు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. కేసు దర్యాప్తులో పదిమంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1.47 కోట్ల నగదు, 4 తులాల బంగారు ఆభరణాలు, ఒక రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. బాధితుల నుంచి వసూళ్లు చేసిన సొమ్ముతో సదరు నిందితులు 92.5 తులాల బంగారు ఆభరణాలు కొనుగోలు చేశారు. వాటిని బ్యాంకుల్లో తాకట్టు పెట్టారు. కాగా, ఆ మిగతా బంగారాన్ని కూడా త్వరలోనే చట్టప్రకారం స్వాధీనం చేసుకుంటామని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో నిందితులైన మరో ముగ్గురు రూహత్ బేగ్, ఉపేంద్రనాయుడు, రవిరాజ్‌లు ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే పట్టుకుని అరెస్ట్ చేస్తామని తెలిపారు. ప్రస్తుతం దాసు, హారికను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు. ఈ కేసులో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా వ్యవహరించిన కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు, ఎస్సై గడ్డం ప్రవీణ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు, ఎస్సై గడ్డం ప్రవీణ్, పీఆర్వో దాములూరి శ్రీనివాస్, చుంచుపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుల ఆత్మహత్యలు పట్టవా..

## భద్రాద్రి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా



మణుగూరు టౌన్, జూలై 9 : ఉమ్మడి జిల్లాలో రైతుల ఆత్మహత్యాయత్నాలు తీవ్రంగా కలచివేస్తున్నాయని, ఖమ్మంలో జిల్లాలో ఒకరు, భద్రాద్రి జిల్లాలో ఒకరు ప్రాణాలు విడుస్తుంటే అండగా నిలవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని, ఇది ఎంతవరకు సబబు అని భద్రాద్రి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. రైతులెవరూ ధైర్యం కోల్పోవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని, రైతులకు బీఆర్‌ఎస్ పార్టీ, కేసీఆర్ అండగా ఉంటారని తెలిపారు. ఆయా ఘటనల వెనుక ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల ప్రమేయం, ఒత్తిడి ఉన్నట్లు తెలుస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాల ఉసురు తప్పక తగులుతుందని, ముదిగొండ, రఘునాథపాలెం మండలాల రైతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు.

# చదువులు సాగేదెట్టా..!

## అంపశయ్యపై ప్రభుత్వ విద్యావ్యవస్థ

"ఏ దేశాన్నైనా నాశనం చేయాలంటే ఎడ్యుకేషన్ సిస్టమ్‌ను దెబ్బ తీస్తే చాలు.. దానంతట అదే సర్వనాశనం అవుతుంది." ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రభుత్వ విద్యావ్యవస్థ ఘోరమైన పరిస్థితిలో ఉంది. పలు పాఠశాలల్లో సమస్యలు తిష్ఠ వేసుకొని కూర్చున్నాయి. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేరు.. పారిశుధ్యం పడకేసింది.. స్కావెంజర్లు లేకపోవడంతో మరుగుదొడ్లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. విద్యార్థులకు పూర్తిస్థాయిలో పుస్తకాలు లేవు.. రెండు జతల యూనిఫాం లేదు.. ఇక మధ్యాహ్న భోజన నిర్వాహకుల దుస్థితి మరీ దయనీయం. జీతాలు లేక కుటుంబం గడవడమే కష్టంగా మారింది. ఇదంతా కాంగ్రెస్ 'ప్రజాపాలన' పుణ్యమేనంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఖమ్మం, జూలై 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)



- పాఠశాలల్లో తిష్ఠ వేసిన సమస్యలు
- వెక్కిరిస్తున్న ఉపాధ్యాయుల ఖాళీలు
- స్కావెంజర్లు లేక పడకేసిన పారిశుధ్యం
- విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందని పుస్తకాలు
- ఒక జత యూనిఫాం మాత్రమే పంపిణీ
- మధ్యాహ్నభోజన నిర్వాహకుల దుస్థితి దయనీయం
- బిల్లులు రాక.. జీతాలు లేక.. కుటుంబం గడవని పరిస్థితి

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సమస్యలతో సహవాసం చేస్తున్నారు. మధ్యాహ్న భోజన సిబ్బంది వెతలు వర్ణనాతీతం. ఏజెన్సీలకు నిర్వహణ ఖర్చులు, గుడ్ల బిల్లులు రాక బోరుమంటున్నారు. కుటుంబపోషణ గడవక సతమతమవుతున్నారు. ఇక ఏ పాఠశాల పరిస్థితి చూసినా ఏముంది గర్వకారణం అన్నట్లుగా పిచ్చిచెట్లు, చెత్తాచెదారంతో నిండిపోయాయి. అక్కడక్కడా ఉపాధ్యాయులు సొంత డబ్బులతో స్కావెంజర్స్‌ను నియమించుకుంటున్నా మిగిలిన పాఠశాలల్లో టాయిలెట్స్ డోర్సు తెరిచే అవకాశమే లేదు. కొన్ని పాఠశాలల్లో కొన్ని సబ్జెక్ట్‌లకు చాక్‌పీస్ పట్టుకునేవారే లేరు, ఉపాధ్యాయ ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. వీటన్నింటిని పరిష్కరించి పాఠశాలలకు మళ్లీ మునుపటి దశ తీసుకురావాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

### పెండింగ్‌లో కుక్ కం హెల్పర్ గౌరవవేతనాలు...

అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శనిలా ఉంది ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కుక్ కం హెల్పర్స్ పరిస్థితి. నెలల తరబడి గౌరవ వేతనాలు చెల్లించకపోవడంతో వారి బాధలు చెప్పశక్యం కానివిగా ఉన్నాయి. నెలనెలా మొదటి తేదీనే జీతాలు తీసుకుంటున్న అధికారులు, ప్రభుత్వానికి కుక్ కం హెల్పర్స్ బాధలు చెవికెక్కడం లేదు. చాలీచాలని గౌరవ వేతనంతో బతుకులు వెళ్లదీస్తున్నా ఆ కొద్దిమొత్తాలు కూడా నెలనెలా అందక వారి కుటుంబాలు పస్తులుండాల్సి వస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో మొత్తం 2,434 మంది కుక్ కం హెల్పర్స్ పని చేస్తున్నారు. వీరికి గౌరవ వేతనంగా నెలకు ఒక్కొక్కరికి రూ.3 వేలు చెల్లిస్తున్నారు. దీనిలో రూ.వెయ్యి కేంద్ర ప్రభుత్వం, మిగతా రూ.2 వేలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి. కేంద్ర ప్రభుత్వం 2023-24కి సంబంధించి ఇటీవల కొంత నిధులను విడుదల చేసింది. మధ్యాహ్న భోజన సిబ్బంది గౌరవ వేతనం సకాలంలో రాక సమస్యలు పడుతున్నారు. 2024 సంవత్సరం ఫిబ్రవరి, మార్చి వరకు వేతనాలను చెల్లించారు. ఇంకా మార్చి, ఏప్రిల్, జూన్‌కు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.

### గుడ్ల బిల్లూ అంతే...

విద్యార్థులకు బలవర్ధకమైన, పౌష్టికహార భోజనాన్ని అందించాలని ప్రభుత్వం వారానికి రెండు మధ్యాహ్న భోజనంలో గుడ్లు అందిస్తోంది. మధ్యాహ్న భోజనంతోపాటు గుడ్డు అందించే వారికి మాత్రం బిల్లులు రాక బలహీన పడిపోయేలా చేస్తున్నాయి. మేము బిల్లులు రాకపోతే మధ్యాహ్న భోజనం సైతం అందించలేమనే పరిస్థితి కొన్నిచోట్ల అధికారులకు ఎదురవుతుంది. జిల్లాలో గత సంవత్సరంలో 87,574 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం లబ్ధి చేకూరగా 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థుల తాలూకా గుడ్డుకు సంబంధించిన బిల్లులు ఫిబ్రవరి వరకు అందాయి. 9, 10వ తరగతి విద్యార్థులకు సంబంధించిన బిల్లులు మాత్రం 2023 డిసెంబర్ వరకే అందించారు. మధ్యాహ్న భోజనం బిల్లులు సైతం 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు మార్చి వరకు రాగా, 9, 10వ తరగతి విద్యార్థులకు 2024 జనవరి నెల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి.

### పాఠశాలల నిర్వహణ గాలికి...

పాఠశాలల్లో స్కావెంజర్స్ లేక పాఠశాలలు అస్తవ్యస్థంగా ఉన్నాయి. ఇటీవల ఖమ్మం జిల్లా కలెక్టర్ ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్షలో హెచ్‌ఎంలంతా సమష్టిగా స్కావెంజర్స్ కావాలని విన్నవించారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆవరణను శుభ్రం చేసేవారు లేక, టాయిలెట్స్ ముక్కు మూసుకొని పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని పాఠశాలల్లో అయితే ఉపాధ్యాయులు తలా కొంత వేసుకుని సిబ్బందిని నియమించుకున్న సంఘటనలు ఉన్నాయి. మరికొన్ని పాఠశాలల్లో దాతల సహకారంతో స్కావెంజర్స్‌ను నియమించుకున్నారు. జిల్లాలో అమ్మ ఆదర్శ కమిటీలు నామమాత్రమే అయ్యాయి. చాలా స్కూల్స్‌లో మరమ్మతు పనులు పెండింగ్‌లో ఉన్నాయంటే వాటి పరిస్థితిని అంచనా వేయవచ్చు.

### బోధన గండం...

చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక బోధన దినదినగండంగా మారింది. వేంసూరు, ఎర్రుపాలెం వంటి మండలాల్లో చాలా సబ్జెక్ట్‌ల్లో ఉపాధ్యాయులే లేరు. ఎస్‌జీటీలు, పండిట్‌లు అప్‌గ్రేడ్ అయిన తర్వాత జిల్లాలో ఎస్‌జీటీల ఖాళీలు 776 ఉన్నాయి. వీరితోపాటు ఈ రెండునెలల కాలంలో ఉద్యోగ విరమణ పొందనున్న వారు సుమారు వంద మందికిపైగానే ఉన్నారు. వీరందరితో కలిపి సుమారు వెయ్యి మందికి పైగా జిల్లాలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ఉపాధ్యాయుల సర్దుబాటు చేద్దామన్నా పూర్థిస్థాయిలో విద్యార్థులకు న్యాయం చేయలేని పరిస్థితి ఉందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

### యూనిఫాం రెండు జతలివ్వాలి



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల కోసం కేసీఆర్ ప్రభుత్వం అమలుచేసిన బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలి. బ్రేక్‌ఫాస్ట్ లేక ఎంతోమంది పేద విద్యార్థులు అలమటిస్తున్నారు. ప్రజాపాలన అని చెప్పి ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి బ్రేక్‌ఫాస్ట్ విధానాన్ని కొనసాగిస్తే బాగుంటుంది. విద్యార్థులకు రెండు జతల యూనిఫాం కచ్చితంగా ఇవ్వాల్సిందే. ఒక జత ఇచ్చి చేతులు దులుపుకుంటే ఊరుకునేదిలేదు. ఒక జత యూనిఫాంతో రోజూ స్కూల్‌కు ఎలా వేసుకెళ్లాలో తెలియని అయోమయ పరిస్థితి విద్యార్థుల్లో నెలకొంది.

**- మందడపు అశోక్‌కుమార్, పెనుబల్లి మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు**

### 'సీఎం బ్రేక్‌ఫాస్ట్'ను ఆపొద్దు..



పేద విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న 'సీఎం బ్రేక్‌ఫాస్ట్'ను ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగించాలి. సర్కార్ స్కూల్స్‌లో చదువుకునే విద్యార్థులు ఆకలితో అలమటించొద్దనే గొప్ప ఆలోచనతో గత సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకంతో పేదల పిల్లల కడుపు నిండుతుంది.

**- పాకనాటి శ్రీనివాసరావు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, జడ్పీ ఉన్నత పాఠశాల, దమ్మపేట**

### వేతనాలు అందడం లేదు..



గత సంవత్సరం వరకు వేతనాలు అందాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సక్రమంగా అందడం లేదు. అంగన్‌వాడీ ఆయాలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. అల్పాహారం పథకం కూడా కొనసాగడం లేదు. కోడిగుడ్డు, పాలు సక్రమంగా అమలుకావడం లేదు. టీఏ, డీఏలు రావడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం టీచర్లకు లక్ష, ఆయాలకు రూ.50 వేలు ఇచ్చి రిటైర్‌మెంట్ చేయాలని చూడడం అన్యాయం. జీవో నెంబర్ 10ని అమలు చేస్తూ త్వరగా పదవీ విరమణ వయసును నిర్ధారించడంపై సమ్మెలు చేస్తున్నాం. మా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించి పరిష్కరించాలి. **- ఈసం వెంకటరమణ, అంగన్‌వాడీ టీచర్ హెల్పర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు, ఇల్లెందు**

### జీతాలు వెంటనే పెంచాలి..



నేను తిమ్మంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో కుక్‌గా గత ఐదేండ్లుగా పనిచేస్తున్నాను. గత ప్రభుత్వంలో జీతాలు, బిల్లులు సమయానికి వచ్చేవి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి ఏడు నెలలుగా బిల్లులు సరిగ్గా అందడం లేదు. కోడిగుడ్డు బిల్లులు ఫిబ్రవరి నుంచి రాలేదు. వీటిని వెంటనే చెల్లించాలి. మధ్యాహ్నభోజనం నడపడం ఆర్థికంగా చాలా ఇబ్బందిగా ఉంది. మా జీతాలు మూడు నెలలకి పెంచుతామని ప్రభుత్వం చెప్పింది, కానీ ఇంతవరకు పెంచలేదు. **- సంగం అంజమ్మ, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, తిమ్మంపేట, ములకలపల్లి మండలం**

# కాలువ పనులను వేగిరం చేయాలి


పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అన్నపురెడ్డిపల్లి, జూలై 9: సీతారామ ప్రాజెక్టు కాలువల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడవద్దని సూచించారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో మంగళవారం పర్యటించిన ఆయన.. గుంపెన గ్రామ శివారులో జాతీయ రహదారిపై నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు కాలువ వంతెన, కాలువ నిర్మాణ పనులను భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టు కాలువ నిర్మాణ పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకొన్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. పనులను వేగవంతంగా చేపట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలువ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీతారామ ప్రాజెక్టు సీఈ ఏ.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఈ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ అర్జున్, డీఈఈ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# విస్తారంగా వర్షాలు

- భద్రాద్రి జిల్లాలో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం
- లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరడంతో ప్రజల అవస్థలు
- పుణ్యపు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో నిలిచిపోయిన రాకపోకలు
- భద్రాచలం వద్ద గోదావరిలో కొత్త నీరు


దుమ్ముగూడెంలో గుబ్బలమంగి ప్రాజెక్టులో అలుగుపై నుంచి ప్రవహిస్తున్న నీరు

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 9 (నమస్తే తెలంగాణ)/పాల్వంచ/ఆళ్లపల్లి/జూలూరుపాడు/ మణుగూరు టౌన్ : జిల్లాలోని అన్ని మండలాల్లో సోమవారం రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. ఆళ్లపల్లి, మణుగూరు, జూలూరుపాడు, పాల్వంచలో భారీ వర్షం కురవగా.. ఇతర మండలాల్లో మోస్తరుగా పడింది. దీంతో ముర్రేడు, మసివాగు, కిన్నెరసాని ప్రాజెక్టులోకి వరద నీరు చేరింది. దుమ్ముగూడెం మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సీతవాగులో వరద నీరు ప్రవహిస్తోంది. నారచీరల ప్రాంతం నీటిలో మునిగింది. గుబ్బలమంగి ప్రాజెక్టులోకి వర్షపు నీరు చేరడంతో అలుగుపై నుంచి నీరు పారుతోంది. పాల్వంచలో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉరుములు, మెరుపులతో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వెంగళరావు కాలనీ, ప్రశాంత్ కాలనీ, ఇందిరా కాలనీ, వికలాంగుల కాలనీ, శివనగర్, సోనియా నగర్, నవభారత్ తదితర లోతట్టు ప్రాంతాలు జలమ యమయ్యాయి. పట్టణంలోని డ్రైనేజీలు పొంగి రోడ్లపైకి మురుగు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. బస్టాండ్ ప్రాంగణంలోకి వరద నీరు చేరడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోకి నీరు చేరడంతో చెరువును తలపించింది. ఆళ్లపల్లి మండలంలో ఉదయం నుంచి వర్షం కురుస్తోంది. అనిశెట్టిపల్లి వద్ద గల పుణ్యపు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. జూలూరుపాడు మండలం పడమటనర్సాపురం, కాకర్ల, మాచినేనిపేటతండా, కొమ్ముగూడెం గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాగులు, చెరువుల్లోకి భారీగా వరద నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మణుగూరు మండలంతోపాటు పట్టణంలో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సుందరయ్య నగర్, వినాయక నగర్ ప్రజలు వరద నీటితో తీవ్ర ఇక్కట్లు పడ్డారు. కట్టు వాగు ఉధృతంగా ప్రవహించింది. సమితిసింగారంలోని అగ్ని మాపక కేంద్రం పరిసరాలు పూర్తిగా నీట మునిగాయి. సింగరేణిలో ఓబీ వెలికితీతకు అంతరాయం ఏర్పడిందని అధికార వర్గాలు తెలిపాయి. భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.

### మరో రెండు రోజులపాటు వర్షాలు..

జిల్లాలో మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్, భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను కూడా అందుబాటులో ఉంచారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. టీబీ జాయింట్ డైరెక్టర్ రాజేశం రెండు రోజుల క్రితం వైద్య, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మందుల కొరత లేకుండా చూడాలని సూచించారు.


మణుగూరు టౌన్ : ప్రవహిస్తున్న కట్టు వాగు


ఆళ్లపల్లి : అనిశెట్టిపల్లి వద్ద పుణ్యపు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో నిలిచిన రాకపోకలు


పాల్వంచ : పాల్వంచ తహసీల్దార్ కార్యాలయంలో నిలిచిపోయిన వర్షపు నీరు

# ఏజెన్సీలో విరివిగా మొక్కలు నాటాలి

## డీఎఫ్‌వో కిష్టగౌడ్

ఇల్లెందు రూరల్, జూలై 9 : ఏజెన్సీ ప్రాంతాల్లో మొక్కలు విరివిగా నాటి.. వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని డీఎఫ్‌వో కిష్టగౌడ్ అన్నారు. మంగళవారం ఒడ్డుగూడెం బీట్ ఫారెస్టు రేంజ్‌లో ఆయన అధికారులతో కలిసి బీట్‌ను సందర్శించారు. మొక్కలు నాటిని అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు రాకుండా ఉండాలనే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో 25 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. వన మహోత్సవం కార్యక్రమాన్ని ఎంతో పకడ్బందీగా నిర్వహిస్తూ.. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. అలాగే రోడ్ల వెంట ఎండిన చెట్లు, మహా వృక్షాల స్థానంలో మళ్లీ మొక్కలు నాటడం వల్ల పునరుజ్జీవం పోసినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో కె.వెంకన్న, ఇల్లెందు, కొమరారం రేంజర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో కిష్టగౌడ్

# 'కేవోసీ-3 బ్లాకు వేలాన్ని రద్దు చేయండి'


కోయగూడెంలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘం నాయకులు, కార్మికులు

టేకులపల్లి, జూలై 9 : కోయగూడెం వోసీ-3ని సింగరేణి సంస్థకే కేటాయించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మందా నర్సింహారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని బ్రహ్మాచారి డిమాండ్ చేశారు. మంగళవారం టేకులపల్లి మండలం కేవోసీ ఉపరితల గనిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ అధ్యక్షతన ఫిట్ మీటింగ్, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థను కాపాడుకోవడం కోసం ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకోవడమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వేల కోట్ల లాభాల్లో ఉన్న సింగరేణి సంస్థకు నష్టం చేసే చర్యలకు పాల్పడుతున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో రాష్ట్ర ప్రభుత్వం ఎటువైపు ఉంటుందో తేల్చుకోవాలన్నారు. సింగరేణి సంస్థలోని కార్మిక సంఘాలు సంస్థ పరిరక్షణ కోసం వేలాన్ని వ్యతిరేకిస్తూ ఐక్యంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నబీ, గుగులోత్ రాంచందర్, ఈసం నర్సింహారావు, కుంజ రమేశ్, సురేశ్, బాలకృష్ణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.